సీఎం రిలీఫ్‌ఫండ్‌ చెక్కు అందజేత



మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్‌: కొండాపూర్‌ డివిజన్‌ పరిధిలోని ప్రేమ్‌నగర్‌ బీ బ్లాక్‌కి చెందిన పద్మ వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి రూ.51 వేలు చెక్కును బుధవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు గణేష్‌, ప్రసాద్‌, సత్యంగౌడ్‌, యాదగిరిరెడ్డి, రవిశంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ భాస్కర్‌ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సాయి ఐశ్వర్య కాలనీ, ఖాజాగూడ తదితర ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్‌ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆల్విన్‌కాలనీలో..

విద్యుత్‌ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్‌ సరఫరాను నిలిపివేయనున్నట్లు అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాంనగర్‌ ఫీడర్‌ పరిధిలో తులసినగర్‌, ఆదిత్యనగర్‌, శ్రీరాంనగర్‌, సాయిచరణ్‌ కాలనీ, సాయి ప్రశాంత్‌నగర్‌, కృష్ణవేణినగర్‌, ఇంద్రానగర్‌, ఇంద్రాహిల్స్‌ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్‌ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఆటో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలి



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: ఆటోలో ప్రయాణిస్తున్న వారిని క్షేమంగా గమ్యం చేర్చడంతో పాటు సమాజం పట్ల సామాజిక స్పృహతో వ్యవహరించాల్సిన బాధ్యత ప్రతి ఆటో డ్రైవర్‌పై ఉందని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని అడ్డగుట్ట ఆటోస్టాండ్‌, జేఎన్‌టీయూ ఆటో స్టాండ్‌ల వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారిపై జరిగిన అఘాయిత్యాలను గుర్తు చేస్తూ అలాంటి పరిస్థితులు తిరిగి మరోమారు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. ఆటోస్టాండ్‌కు వచ్చే ప్రతి ఆటో రిజిస్ట్రేషన్‌ నంబర్‌, యజమాని పేరు, డ్రైవర్‌ పేరు, గుర్తింపు కార్డులను సరిచూసుకోవాలన్నారు. ప్రతి ఆటోకు సీరియల్‌ నంబర్‌ కేటాయించి, దానిని కూడా అందరికీ కనిపించేలా ఆటోపై అతికించాలన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన అనుమానాస్పద ఆటోలను గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కేపీహెచ్‌బీ సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని, లోపిస్తే చర్యలు తప్పవని కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ అన్నారు. ఆల్విన్‌కాలనీ శంషీగూడలో సీసీ రోడ్డు పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా త్వరగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్‌ గౌడ్‌, రఘు, ప్రవీణ్‌, రామరాజు, సాయికిరణ్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రవికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పడిపూజ



పడిపూజలో ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌లో రాహుల్‌ ప్రదీప్‌ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడిపూజను బుధవారం ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హాజరయ్యారు. అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆ ప్రాంతమంతా అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగింది. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌, నాయకులు ఎండీ ఇబ్రహీం, పోతుల రాజేందర్‌, కొండా విజయ్‌, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓలకు ప్రభుత్వ వాహనం కేటాయించాలి

ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌ రాథోడ్‌

పటాన్‌చెరు టౌన్‌: ఎంఈఓలకు ప్రభుత్వ వాహనం కేటాయించాలని ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌ రాథోడ్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం పటాన్‌చెరు డివిజన్‌ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండల విద్యాధికారిగా పర్యవేక్షణ, నోడల్‌ ఆఫీసర్‌గా, గ్రామ స్పెషల్‌ ఆఫీసర్‌గా అనేక బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎంఈఓలకు రాష్ట్ర ప్రభుత్వం వాహన సౌకర్యం కల్పించాలని కోరారు. ఎంపీడీఓలకు, తహసీల్దార్లకు ఇతర అలెవెన్సులు చెల్లిస్తున్నట్టే ఎంఈఓలకు కూడా కల్పించాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2023 జులై 1వ తేదీ నుండి రావాల్సిన పీఆర్సీని వెంటనే ప్రకటించాలని కోరారు.ఉద్యోగులకు ఉచిత హెల్త్‌ కార్డులు జారీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే మంజూరు చేయాలని కోరారు.

ముందుకు సాగని పనులు..

సమస్య తీరేదెన్నడు..?

మంజీర రోడ్డు పనుల్లో అలసత్వం.. రాకపోకలకు ఇబ్బందులు



మంజీరా పైప్‌లైన్‌ రోడ్డు తవ్విన దృశ్యం

చందానగర్‌: నిత్యం లీకేజీలతో ఏళ్ల తరబడి ఇబ్బందులు పడ్డ మంజీరా రోడ్డులో నూతన పైప్‌లైన్‌ పనులు చేపట్టి ఇటీవల పూర్తి చేశారు. పైప్‌లైన్ల తవ్వకాలతో రోడ్డంతా గుంతలమయంగా మారింది. వాహనదారుల ఇబ్బందులపై ఇటీవల వరుస కథనాలు రావడంతో ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేక నిధులతో రోడ్డు నిర్మాణ పనులకు అక్టోబర్‌ 5వ తేదీ శంకుస్థాపన చేశారు.జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్‌ అధికారులు 4 కోట్లతో రోడ్డు పనులు ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి రోడ్డు తవ్వి పక్కన మట్టిపోయడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. మంజీరా రోడ్డు కొంతమేర తవ్వారు. రోడ్డుకు అడ్డంగా మట్టి పోసి వదిలేశారు. దీంతో రోడ్డు మరింత ఇరుకుగా మారింది. కాగా ఉదయం, సాయంత్రం వేళలలో ట్రాఫిక్‌ ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పనులు జరగకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

- హఫీజ్‌పేట్‌ ఫ్లైఓవర్‌ నుంచి చందానగర్‌ ఇంజనీరింగ్‌ ఎన్‌క్లేవ్‌ వరకు సుమారు రూ.4 కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.
- ఒకవైపు పూర్తిగా గుంతలు, మరో వైపు రోడ్డులో వారాంతపు సంత, వాహనాల రాకపోకలు చేస్తున్నారు. దీంతో తీవ్ర ట్రాఫిక్‌ సమస్య తలెత్తుతోంది.
- జీహెచ్‌ఎంసీ సర్కిల్‌- 21 ఇంజనీరింగ్‌ ఉన్నతాధికారులు, ఉప కమిషనర్‌లు స్పందించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి



హఫీజ్‌పేట్‌ నుంచి ఇంజనీర్స్‌ ఎన్‌క్లేవ్‌ వరకు నూతన రోడ్డుకు శంకుస్థాపన చేసినప్పటికీ పనులు ప్రారంభించకపోవడం ఆశ్చర్యంగా ఉంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని పనులు వెంటనే ప్రారంభించాలి.

– రమేష్‌ బండారి, మదీనాగూడ

నిత్యం ట్రాఫిక్‌ సమస్య



సంవత్సరం నుంచి మంజీరా రోడ్డు గుంతలమయంగా ఉంది. గత నెల రోడ్డు పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టర్‌ ఇప్పటి వరకు మొదలుపెట్టలేదు. కొంతదూరం రోడ్డు తవ్వి మట్టిని రోడ్డుపైనే పోశారు.

– మన్మధరావు, మదీనాగూడ





రోడ్డుపై మట్టిపోయడంతో ఇబ్బందిపడుతున్న వాహనదారులు



అస్తవ్యస్తంగా మంజీరా రోడ్డు

స్పా అండ్‌ సెలూన్‌ ముసుగులో వ్యభిచారం

పోలీసుల దాడి.. ఆరుగురు అరెస్ట్‌

చందానగర్‌: గుట్టుచప్పుడు కాకుండా స్పా అండ్‌ సెలూన్‌ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న సెంటర్‌పై మంగళవారం రాత్రి చందానగర్‌ పోలీసులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు.. చందానగర్‌ వేముకుంటలో న్యూ డ్రీమ్‌ స్పా అండ్‌ సెలూన్‌ సెంటర్‌లో ఆరు గదులలో గత మూడు నెలల నుంచి రామకృష్ణ అనే వ్యక్తి స్పా అండర్‌ సెలూన్‌ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. సబ్‌ ఆర్గనైజర్‌గా కరుణశ్రీ స్పా సెంటర్‌ను చూసుకుంటుంది. డబ్బు కోసం నిర్వాహకుడు స్పా సెంటర్‌లో పని చేస్తున్న యువతులతో వ్యభిచారం నిర్వహించాలని ఆమెను ఆదేశించాడు. విషయం అందుకున్న చందానగర్‌ పోలీసులు మంగళవారం రాత్రి స్పా సెంటర్‌పై దాడి చేయగా ఓ గదిలో యువతితో పాటు అమీన్‌పూర్‌కు చెందిన సందీప్‌ వెంకట్‌ పట్టుబడ్డారు. గదిలో ఉన్న ఇద్దరితో పాటు సబ్‌ ఆర్గనైజర్‌గా ఉన్న కరుణశ్రీ మరో ముగ్గురు యువతులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నలుగురు యువతులను హోమ్‌కు పంపించగా సబ్‌ ఆర్గనైజర్‌ కరుణశ్రీతో పాటు విటుడు సందీప్‌ను రిమాండ్‌కు తరలించారు. సెంటర్‌ నిర్వాహకుడు మహేందర్‌ పరారీలో ఉన్నాడని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

21 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలు విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం నిర్వహించిన డ్రైవ్‌లో పటుబడ్డ 21 మంది వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం



అంకిత (ఫైల్‌)

చందానగర్‌ : మహిళ అదృశ్యమైన సంఘటన చందానగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్‌ జిల్లా తాండూర్‌కు చెందిన ఎరుకల శ్రీను కుటుంబంతో కలిసి గత రెండు సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి లింగంపల్లి శివాజీనగర్‌లో నివాసముంటున్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అతని భార్య ఎరుకల అంకిత (20) ప్రైవేట్‌ కంపెనీలో హౌస్‌ కీపింగ్‌ చేస్తుంది. ఈ నెల 11వ తేదీ ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి పనికి వెళ్లింది. సాయంత్రం అయిన ఇంటికి తిరిగి రాకపోవంతో భర్త శ్రీను ఆమె పని చేసే కంపెనీకి వెళ్ళి ఆరాతీయగా పని ముగించుకొని వెళ్ళిపోయిందని తెలుపడంతో బంధువులు, స్నేహితుల వద్ద పరిసర ప్రాంతాలలో వెదకగా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం చందానగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఏడు కార్లు స్వాధీనం.. కిలాడీ లేడీ కేసులో పురోగతి

గచ్చిబౌలి: సెల్ఫ్‌ డ్రైవ్‌ పేరిట ఎక్కువ అద్దె ఆశచూపి అదే కార్లపై లోన్‌ తీసుకున్న కిలాడీ లేడీ కేసులో రాయదుర్గం పోలీసులు పురోగతి సాధించారు. ఇప్పటికే నిందితురాలు ఉషా, ఆమె డ్రైవర్‌ మల్లేష్‌ను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. కార్లను కుదువబెట్టుకొని లోన్‌ ఇచ్చిన సాగర్‌, అనిల్‌లను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారించిన అనంతరం 7 కార్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బీదర్‌, పూణే తదితర ప్రాంతాల నుంచి మరో 15 కార్లు స్వాధీనం చేసుకోవాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

సమగ్ర సర్వేను పరిశీలించిన ఉన్నతాధికారులు



లక్ష్మీవిహార్‌ ఫేజ్‌-2లో సర్వే తీరును పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పేషీ అధికారి నవిక

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలో కొనసాగుతున్న సర్వేను బుధవారం డిప్యూటీ సీఎం పేషి అధికారి నవిక హర్షే పరిశీలించారు. సర్కిల్‌ పరిధిలోని లక్ష్మీవిహార్‌ ఫేజ్‌-2 కాలనీ, రైల్‌విహార్‌లలో పర్యటించి ఎన్యుమరేటర్లను వివరాలు అడిగితెలుసుకున్నారు. ఫారాలను పరిశీలించారు. అంతకుముందు సర్వే చేసిన ఇళ్లకు వెళ్ళి సర్వే తీరుపై యజమానులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రేమ్‌కుమార్‌, ట్యాక్స్‌ ఇన్‌స్పెక్టర్‌ దిలీప్‌ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌ బిల్డింగ్‌, సోలార్‌ పవర్‌ప్లాంట్‌ సందర్శన



గచ్చిబౌలి: ఈపీటీఆర్‌లో శిక్షణ తీసుకుంటున్న విదేశీయులు బుధవారం మాదాపూర్‌లోని సీఐఐ గ్రీన్‌ బిల్డింగ్‌, శంషాబాద్‌లోని సోలార్‌ పవర్‌ప్లాంట్‌ను సందర్శించారు. గచ్చిబౌలిలోని ఈపీటీఆర్‌ఐలో 'రిన్యూవబుల్‌ ఎనర్జీ రిసోర్సెస్‌ ఫర్‌ ఎనర్జీ ఆటోనమీ అండ్‌ మిటిగేషన్‌ ఆఫ్‌ క్లైమేట్‌ ఛేంజ్‌' అనే అంశంపై రెండు వారాల పాటు శిక్షణ కోసం వివిధ దేశాలకు చెందిన డెలిగేట్స్‌ విచ్చేశారు. ఈపీటీఆర్‌ఐ డైరెక్టర్‌ జనరల్‌ అహ్మద్‌ నదీమ్‌ ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగుతోంది. ఫీల్డ్‌ విజిట్‌లో భాగంగా మాదాపూర్‌లోని సీసీఐలోని గ్రీన్‌ బిల్డింగ్‌, శంషాబాద్‌లోని 9 మెగావాట్ల జీఎంఆర్‌ సోలార్‌ ప్లాంట్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఈపీటీఆర్‌ఐ క్లైమేట్‌ ఛేంజ్‌ విభాగం హెడ్‌ రాజేశ్వర్‌ సీనియర్‌ ప్రాజెక్ట్‌ అసోసియేట్‌ ప్రవీణ్‌, సీనియర్‌ అసిస్టెంట్‌ ఖదీర్‌ పాల్గొన్నారు.

గంజాయి విక్రేతలు అరెస్ట్‌

పటాన్‌చెరు టౌన్‌: ఎండు గంజాయి విక్రయిస్తున్న నలుగురిని ఎక్సైజ్‌ పోలీసులు అరెస్ట్‌ చేసిన సంఘటన పటాన్‌చెరు ఎక్సైజ్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎక్సైజ్‌ సీఐ పరమేశ్వర్‌గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండలంలోని ఘనాపూర్‌లో, అదేవిధంగా పటాన్‌చెరు పట్టణంలోని వాల్యూ జోన్‌ వద్ద గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు బుధవారం సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టగా ఘనపూర్‌లో ముగ్గురు, పటాన్‌చెరులో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాకు చెందిన మడకరి లచ్చ, ఇర్మే సునం, పునీమ్‌, బిహార్‌కి చెందిన తోకిర్‌ హబీబ్‌ల వద్ద నుంచి 6.03 కిలోల ఎండు గంజాయి, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాలనీల్లో వసతుల కల్పనకు చర్యలు



పాపిరెడ్డి కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ నాగేందర్‌ యాదవ్‌ తదితరులు

కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌

శేరిలింగంపల్లి: కాలనీల్లో మెరుగైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటానని శేరిలింగంపల్లి కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ తెలిపారు. పాపిరెడ్డి కాలనీ, రాజీవ్‌ గృహకల్పలో చేపట్టిన సీసీ రోడ్ల పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్‌ మాట్లాడుతూ పాపిరెడ్డి కాలనీ నుంచి జీహెచ్‌ఎంసీ జోనల్‌ ఆఫీస్‌ వరకు లింకురోడ్డు, రాజీవ్‌ గృహకల్పలో సీసీ రోడ్డు నిర్మాణంతో రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. బస్తీల్లో పారిశుధ్యం, వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ భాస్కర్‌, పాపిరెడ్డి కాలనీ అధ్యక్షులు బద్దం కొండల్‌రెడ్డి, నాయకులు శ్రీకళ, రాంబాబు, లక్ష్మణ్‌యాదవ్‌, వెంకటేశ్వర్లు, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హుడా ట్రేడ్‌ సెంటర్‌ కాలనీలో పర్యటిస్తున్న రవికుమార్‌యాదవ్‌ తదితరులు

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ రవికుమార్‌యాదవ్‌

శేరిలింగంపల్లి: హుడా ట్రేడ్‌ సెంటర్‌లో తవ్వి వదిలేసిన రోడ్డు పనులు పూర్తి చేయాలని బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ ఎం.రవికుమార్‌యాదవ్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం శేరిలింగంపల్లి డివిజన్‌ పరిధిలోని హుడా ట్రేడ్‌ సెంటర్‌ కాలనీలో కంటెస్టెడ్‌ కార్పొరేటర్‌ కె.ఎల్లేష్‌తో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్డు సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్‌ మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యంతో హుడా ట్రేడ్‌ సెంటర్‌ కాలనీ, పరిసరవాసులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు వెంటనే ఆయా పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాజు యాదవ్‌, నాగరాజు,రాజు, చిన్నబాబు, రంజిత్‌, వెంకటరమణ, శేషు, మహేష్‌, శ్రీధర్‌ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వద్దు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: జీహెచ్‌ఎంసీ పరిధిలోని భారతీనగర్‌, రామచంద్రాపురం, పటాన్‌చెరు డివిజన్‌ల పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దని, ప్రతి కాలనీలో నిరంతరం చెత్త సేకరణ చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, రాంకీ సంస్థ ప్రతినిధులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీలో, రహదారులలో సేకరించిన చెత్తను తక్షణమే తరలించాలని ఆదేశించారు. ప్రతిరోజు ఉదయం 4 గంటల నుండి పారిశుద్ధ్య కార్మికుల విధులు ప్రారంభం కావాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో సైతం చెత్త సేకరణ చేపట్టాలని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ఉన్నత అధికారులతో పాటు పారిశుద్ధ్య విభాగం అధికారులు ప్రతి రోజు ఉదయం కాలనీలలో విధిగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో బల్దియా డిప్యూటీ కమిషనర్‌ సురేష్‌, ఏఎంహెచ్‌ విజయ్‌కుమార్‌, రాంకీ సంస్థ జోనల్‌ ఇంచార్జ్‌ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

టీపీజీఎల్‌లో ఆటమ్‌ ఛార్జర్స్‌ జోరు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ప్రీమియర్‌ గోల్ఫ్‌ లీగ్‌ నాలుగో సీజన్‌లో టైటిల్‌ ఫేవరెట్‌ ఆటమ్‌ ఛార్జర్స్‌ దూసుకెళుతోంది. నాలుగో రౌండ్‌లో పూర్తి ఆధిపత్యం కనబరుస్తూ అత్యధిక పాయింట్లు సాధించింది. నాలుగో రౌండ్‌ లో 167 పాయింట్లు సాధించిన ఆటమ్‌ ఛార్జర్స్‌ ఓవరాల్‌గా పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇదే రౌండ్‌లో రియిజ్‌ మాస్టర్స్‌ 161 పాయింట్లు సాధించగా..వ్యక్తిగత ప్రదర్శనల్లో గోల్డెన్‌ ఈగల్స్‌ ప్లేయర్స్‌ మిథున్‌ రెడ్డి, శేషా రెడ్డి 47 పాయింట్ల చొప్పున టాప్‌ ప్లేస్‌లో నిలిచారు. నాలుగో రౌండ్‌ ముగిసేసరికి పాయింట్ల పట్టికలో ఆటమ్‌ ఛార్జర్స్‌ 699 పాయింట్లతో టాప్‌ ప్లేస్‌ లో ఉండగా... టీమ్‌ దాసోస్‌ 675 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. రియిజ్‌ మాస్టర్స్‌ టీమ్‌ 674 పాయింట్లతో మూడో స్థానంలోనూ, ఎంవైకే స్ట్రైకర్స్‌ 672 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాయి.

సానుకూల ఆలోచనలతో ఒత్తిడి దూరం

ఓం శాంతి రిట్రీట్‌ సెంటర్‌ డైరెక్టర్‌ ఆశా దీదీ

గచ్చిబౌలి: మానసిక ఒత్తిడిని సానుకూల ఆలోచనలతో జయించవచ్చని ఓం శాంతి రిట్రీట్‌ సెంటర్‌ ఢిల్లీ డైరెక్టర్‌ ఆశా దీదీ పేర్కొన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో అసఫ్‌ జీహీ రాజవంశానికి చెందిన 9వ నిజాం నవాబు రౌనక్‌ యార్‌ ఖాన్‌ అధ్యక్షతన నిర్వహించిన 'యాన్‌ ఈవినింగ్‌ ఆన్‌ ట్రెస్‌ డిటాక్స్‌' అనే అంశంపై ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆశా దీదీ మాట్లాడుతూ ఒత్తిడి శారీరక, మానసిక, భావోద్వేగ పరిణామాలతో బహుముఖ స్వభావం కల్గి ఉంటుందని చెప్పారు. ప్రతి వ్యక్తి జీవితంలో సవాళ్లను ఎదుర్కొంటాడని, ఒత్తిడి అనేది విశ్వవ్యాప్తమన్నారు. ధ్యానం ద్వారా ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో శాంతి సరోవర్‌ డైరెక్టర్‌ కులదీప్‌ దీదీ, మాజీ ఐఏఎస్‌ అధికారి అజయ్‌ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

రాంనరేష్‌ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా....

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని రాంనరేష్‌ కాలనీలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని బుధవారం కాలనీవాసులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో రాంనరేష్‌ నగర్‌లో పర్యటిస్తానని తెలిపారు. డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాలనీవాసులు పోతుల రాజేందర్‌, వెంకటేష్‌ యాదవ్‌, సత్యనారాయణ, చాట్ల రవి, బ్రహ్మయ్య, మహేందర్‌ రెడ్డి, రాజా నరేంద్ర, అర్జున్‌రెడ్డి, సంతోష్‌ పాల్గొన్నారు.

మెడికవర్‌ ఆస్పత్రులకు రాజకీయ పార్టీలకు ఏ సంబంధం లేదు

కేటీఆర్‌ ఆరోపణలు నిరాధారం : డా. అనిల్‌కృష్ణ

మాదాపూర్‌: మెడికవర్‌ హాస్పిటల్స్‌పై బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారణమైనవని ఆ హాస్పిటల్స్‌ చైర్మన్‌ డాక్టర్‌ అనిల్‌కృష్ణ తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్‌ ఆస్పత్రిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీనియర్‌ కార్డియాలజిస్ట్‌ డాక్టర్‌ అన్నం శరత్‌రెడ్డి మ్యాక్స్‌బీన్‌ ఫార్మాలో డైరెక్టర్‌ కాదని తెలిపారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ముందుకు సాగుతున్నామని, ఎలాంటి రాజకీయ పార్టీలతో సంబంధం లేదన్నారు. కేసీఆర్‌, హరీశ్‌రావు, నితిన్‌గడ్కారి, రామ్మోహన్‌ నాయుడు, శరత్‌పవార్‌, దేవేంద్రఫడ్నవీస్‌ వంటి రాజకీయ ప్రముఖుల చేతుల మీదుగా ఆస్పత్రులను ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో మెడికవర్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ అన్నం శరత్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.